


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 230 | ఏప్రిల్ 17 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# మన దునియా వరుస కథనాలతో కదిలిన విజిలెన్స్ అధికారులు: ఖిలా వరంగల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులతో సరిపెడతారా..?

- ఏసిబి అధికారులు దాడులు చేస్తే అసలు బాగోతం బయటపడుతుంది..

అక్రమ రిజిస్ట్రేషన్లకు ఇదిగో సాక్ష్యం..!

- జిల్లా రిజిస్టర్ అండతోనే ఖిలా వరంగల్ ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్ వెంకట్ లాల్ అక్రమ రిజిస్ట్రేషన్..!
- జిల్లా రిజిస్టర్ ప్రవీణుడిపై ఏసీబీ అధికారులు దృష్టి సారించాలంటూన్నా పలువురు
- తన పరిధిలో ఉన్న ఓ నాన్ లేఔట్ వెంచర్ లోని ప్లాట్లు రిజిస్ట్రేషన్..!!
- అనుమతి లేని వెంచర్ లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినందుకు హనుమకొండ (ఆర్ ఓ) సబ్ రిజిస్ట్రార్ ను సస్పెండ్ చేసిన డిఐజి, "ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడంలో అంతర్యం ఏమిటి..?
- అదే తరహాలో అనుమతి లేని వెంచర్ లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన వెంకట్ లాల్ నీ ఎందుకు సస్పెండ్ చేయరు..?
- ఇప్పటికైనా """ అక్రమ రిజిస్ట్రేషన్ల పట్ల సమగ్రమైన విచారణ చేపట్టాలి




## ఖిలా వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై "విజిలెన్స్" దాడులు

**మన దునియా,ఖిలా వరంగల్, ఏప్రిల్ 16**

ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో డాక్యుమెంట్లు, స్టాంప్ డ్యూటీల్లో అవకతవకలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ వెంకట్ లాల్‌ను అధికారులు విచారించారు. డీఎస్పీ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో పలు రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. దాడుల సమాచారం ముందుగానే తెలిసిన డాక్యుమెంట్ రైటర్లు తమ షెటర్లు మూసివేసి అక్కడి నుంచి పరారయ్యారు. ప్రస్తుతం అధికారుల తనిఖీలు కొనసాగుతుండగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ఇది చరిత్రాత్మక అడుగు: ప్రధాని మోదీ




## ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు.. డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన



- లోక్‌సభ స్థానాల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని స్పష్టత
- ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అమిత్ షా విమర్శ
- జనాభా ప్రాతిపదికన విభజనను వ్యతిరేకిస్తున్న దక్షిణాది నేతలు

లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్)

(మిగతా 2వ పేజీలో..)


## అధికారిక హోదా లేని వ్యక్తి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జోక్యం చేసుకోవడం ఏంటి...!

- ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే చర్య
- కార్యాలయంలో అనుమానాస్పద వ్యక్తి పాత్రపై

**మన దునియా,ఖిలా వరంగల్:ఏప్రిల్ 16**

"అధికారిక హోదా లేని వ్యక్తి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జోక్యం చేసుకోవడం అనేది కేవలం నియమావళి ఉల్లంఘన మాత్రమే కాదు అది అధికార దుర్వినియోగానికి సమానం. ఇలాంటి చర్యలు ప్రభుత్వ వ్యవస్థను

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ఇది చరిత్రాత్మక అడుగు: ప్రధాని మోదీ




మన దునియా న్యూఢిల్లీ:ఏప్రిల్ 16

చట్టసభల్లో మహిళల రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపునకు సంబంధించి కేంద్రం మరికాసేపట్లో మూడు కీలక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా సాధికారత దిశగా నేడు దేశం చరిత్రాత్మక ముందడుగు వేయబోతోందని అన్నారు. భారత దేశ మహిళలపై గౌరవంతో ఈ దిశగా సాగుతున్నామని అన్నారు. తల్లులకు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవమని వ్యాఖ్యానించారు. మహిళల గొప్పదనాన్ని చాటిచేప్పే శ్లోకాన్ని కూడా ప్రధాని షేర్ చేశారు.ఈ బిల్లులకు చట్టరూపం ఇచ్చేందుకు పార్లమెంటు నేటి నుంచీ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కానున్న విషయం తెలిసిందే. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుంచి గరిష్ఠంగా 850కు పెంచేలా ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెడుతోంది. సీట్ల తుది సంఖ్యను మాత్రం డీలిమిటేషన్ కమిషన్ నిర్ణయించనుంది. ఈ బిల్లులకు పార్లమెంటు ఆమోదం లభిస్తే 2029 నుంచీ ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. అయితే, జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్ల కేటాయింపుతో తమకు అన్యాయం జరుగుతుందని ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి..

# తెలంగాణలో అతి త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ?



మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 16

రెండున్నర ఏండ్లగా పెండింగ్ పడుతూ వస్తున్న పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్, ఫెడరేషన్లకు చైర్ పర్సన్ల, నియమాలకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒకటి రెండు రోజుల్లో 17 చేతి వృత్తుల కుల సంఘాలకు చైర్పర్సన్లను నియమించ నున్నారు. దీంతో గంపెడు ఆశలతో ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు.. ఇప్పుడు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కీలక సమా వేశం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర వ్యవహా రాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, భేటీ అయి.. నామినేటెడ్ పోస్టుల భర్తీ, అభ్యర్థుల ఎంపిక వంటి పలు విషయాలపై సమగ్రంగా చర్చలు జరిపారు.ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులను వీలైనంత తొందరగా భర్తీ చేసేందుకు.. ఈ కసరత్తు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి పచ్చ జెండా ఊపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం.. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన నాయకులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇక ఈ నామినేటెడ్ పద వులను కేటాయించడంలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఎవరికీ అన్యాయం జరగ కుండా.. అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని.. సమన్యాయం జరిగేలా ఆశావహుల జాబితాను తయారు చేసినట్లు సమాచారం.

# అధికారిక హోదా లేని వ్యక్తి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జోక్యం చేసుకోవడం ఏంటి...!

(మొదటి పేజీ తరువాయి)

అవమానపరచడమే కాకుండా, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసి తీవ్ర అనుమానాలకు దారి తీస్తాయి.”ఎవరీ రావణ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇతని వృత్తి ఏమిటి గతంలో ఉన్న సబ్ రిజిస్టర్ తో ఇతనికి పరిచయం ఉండేవి ఇప్పుడున్న సబ్ రిజిస్టర్ ఇతనితో అవసరం ఏమిటి ఇతను అటెండర్ ఆఫీసులో క్లారికా లేదు ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ ఇతనికి రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో పని ఏమిటి?

**“కార్యాలయంలో అనుమానాస్పద వ్యక్తి పాత్రపై ”**

సంబంధిత కార్యాలయంలో ఒక వ్యక్తి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నిజంగా ప్రభుత్వ ఉద్యోగి అయితే, ఆయన హోదా, బాధ్యతలను అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగి కాకపోతే, కార్యాలయంలో ఆయన ప్రవేశం, జోక్యం ఎలా అనుమతించబడుతోంది అనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి పారదర్శకత చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు.. డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవని, పైగా సంఖ్యాపరంగా, నిష్పత్తి పరంగా కూడా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయని నిర్దిష్ట లెక్కలతో సహా వివరించారు.మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల సీట్లు కూడా పెరుగుతాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 స్థానాలు (23.76 శాతం) ఉండగా, సభ విస్తరణ తర్వాత 195 స్థానాలకు (సుమారు 23.97 శాతం) పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 816 నుంచి 850కి పెంచి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల పార్లమెంటులో తమ ప్రాతినిధ్యం, ప్రాధాన్యత తగ్గుతుందని వాదిస్తున్నాయి.ఈ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాలని, జనాభాతో పాటు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వంటి ఆర్థిక సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మరోవైపు, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ, తొలుత సీట్లు పెరిగినట్లు కనిపించినా, భవిష్యత్తులో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతానికి ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాల సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ చర్చల నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, అమిత్ షా పేర్కొన్న నియోజకవర్గాల గణాంకాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# మన దునియా వరుస కథనాలతో కదిలిన విజిలెన్స్ అధికారులు: ఖేలా

# వరంగల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులతో సరిపెడతారా..?

మన దునియా/ఖేలా వరంగల్ క్రైం బ్యూరో:ఏప్రిల్ 16

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో తన పలుకుబడితో ఏది చేసినా చెల్లుతుందని, మిగిలిన అధికారులకు వర్తించిన నిబంధనలు తనకేమాత్రం వర్తించవని ఆ సబ్ రిజిస్ట్రార్ ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. తనకు ఉన్నతాధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని తనేంచేసినా చర్యలు తీసుకోరని“ వెంకట్ లాల్“ బరితెగించినట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. “వెంకట్ లాల్“ అక్రమాలపై వరుస కథనాలను ప్రచురిస్తున్న “మన దునియా“ మరో అడుగు ముందుకు వేసి నిబంధనలకు విరుద్ధంగా తను రిజిస్ట్రేషన్ చేసిన నాన్ లేఅవుట్ వెంచర్ లోని వివరాలను బహిర్గతం చేస్తుస్తోంది. “వెంకట్ లాల్“ పరిధిలోని వెలసిన అక్రమ వెంచర్ లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన ఆ సబ్ రిజిస్ట్రార్ ప్రతి ప్లాటుకు ఓ ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వారం నాన్ లేఅవుట్ వెంచర్ లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన ఆనంద్ రామ నరసింహ హనుమకొండ సబ్ రిజిస్ట్రార్ ను డిఐజి ఆదేశాలతో సస్పెండ్ చేసిన ఉన్నత అధికారులు అచ్చం అదే తరహాలో తన పరిధిలోని అనుమతి లేని వెంచర్ లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన “వెంకట్ లాల్“ పై ఎందుకు చర్యలు




తీసుకోరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఆ సీనియర్ అసిస్టెంట్ ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ వెంకట్ లాల్ ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ల బండారం ఆధారాలతో సహా

మరో సంచికలో....

# ఏపీలో భగ్గుమన్న సూరీడు.. నంద్యాలలో 45.1 డిగ్రీలు.. రేపు మరింత తీవ్రత!

**ఏపీలో రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు**
**నంద్యాల జిల్లాలో 45.1 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రత**
**రేపు పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అంచనా**
**రాష్ట్రంలోని 85 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరిక**
**ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించిన విపత్తుల నిర్వహణ సంస్థ**

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది.అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ | శుక్రవారం | 17 | 2026


# విషం కలిపిన బిస్కట్లతో సొంత బిడ్డలను చంపేయాలనే దారుణమైన కుట్ర..

**సుపారీ హత్యకు ప్లాన్ చేసిన తండ్రి..**
**రెండో భార్యతో కలిసి మొదటి భార్య పిల్లలను చంపేయాలనుకున్నాడు..**

**మన దునియా,జనగామ జిల్లా రఘునాథపల్లి,పొట్టిగుబ్బడి తండా:ఏప్రిల్ 16**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బడి తండాలో తరిగొప్పుల మండలం ఆంక్షాపూర్ గ్రామానికి చెందిన అనిత తన ఇద్దరు కుమారులు.. ( ఒకరికి ఆరేళ్లు, ఇంకొక అబ్బాయి తొమ్మిదేళ్లు) తో కలిసి నివాసముంటోంది..భర్త ఏడాది క్రితం శ్రీనివాస్ దుబ్బతండాకు చెందిన మూడావత్ మమతను రెండవ పెళ్లి చేసుకోగా.. అనిత పోలీసులను ఆశ్రయించింది..! దీంతో పోలీసులు సమస్య పరిష్కారం కోసం చేసిన సూచనలతో... తండాకు చెందిన పెద్దమనుషులతో పంచాయతీ ఏర్పాటు చేయించింది..ఇద్దరు పిల్లల పేరిట ఇరవై గుంటల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని పెద్దమనుషులు తీర్మానించారు..దీంతో ఆ భూమి సాగు చేసుకుంటు కూలీ పనులు చేస్తూ అనిత పిల్లల బాగోగులు చూసుకుంటోంది..కొద్దిరోజులకు తన భూమి తనకు ఇవ్వాలని శ్రీనివాస్ అనితను వేధించడం మొదలుపెట్టడంతో మరోసారి అనిత పోలీసులను ఆశ్రయించింది..దీంతో శ్రీనివాస్ ఎలాగైనా భూమిని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్మాదపు ఆలోచన చేశాడు.. రెండో భార్యతో కలిసి అనిత పిల్లలను అంతమొందించేందుకు ప్లాన్ రూపొందించాడు..స్కూల్ కు వెళ్ళే ఇద్దరు కుమారులకు ఎలాగైనా విషం కలిపిన బిస్కట్లు తినిపించాలని ప్లాన్ చేశాడు.. అనుకున్న ప్రకారం ఒక వ్యక్తికి సుపారీ ఇచ్చి అతని ద్వారా పిల్లలకు



బిస్కట్లు తినిపించాలని చూసాడు..అయితే సుపారీ ఒప్పందం చేసుకున్న వ్యక్తి మానవత్వంతో ఆలోచించి... నేరుగా శ్రీనివాస్ కుట్ర విషయాన్ని అనితకు చెప్పాడు.. దీంతో అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది..కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్ సహా అతని రెండవ భార్య మమతను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు..ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.. రెండు మండలాల పరిధిలో ఉన్న తండాల వాసులు నిందితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...వారిద్దరిని తండాకు మళ్లీ రాకుండా బహిష్కరించాలని అభిప్రాయపడుతున్నారు..

# పెట్రోల్ బంకుల్లో కూలర్ల ఏర్పాటు!

**మన దునియా,అదిలాబాద్ జిల్లా: ఏప్రిల్ 16**

ఆదిలాబాద్ జిల్లాలో తీవ్రంగా ఎండలు దంచి కొడుతున్నాయి, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి రోడ్డెక్కితే చాలు మాడ పగిలిపోతుంది, ఎండ తీవ్రతకు వడగాలులు తోడవడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో రికార్డు స్థాయి 44 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.. దీంతో ఎండలు సెగలు పుట్టిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవు తుండటం గమనార్హం. ఈ వేడికి తట్టుకోలేక రోడ్లపై వెళ్తున్న ఎలక్ట్రిక్ వాహనా లు పేలిపోతున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ వాహ నాలు సైతం అగ్నిప్రమాదా లకు గురవుతున్నాయి. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉం చుకుని నిర్మల్ జిల్లా లోని పెట్రోల్ బంక్ యజమాను లు అప్రమత్తమయ్యారు. ఎండ తీవ్రత నుంచి బంకులను కాపాడుకోవ డానికి, అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎక్కడికక్కడ కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనదారులు కాసేపు సేద తీరేలా ప్రత్యేక ఏర్పా ట్లు కూడా చేస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్ పోసే మిషన్లకు ప్రత్యేకంగా కూలర్లను ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంక్ నిర్వహకులు. మధ్యాహ్నం పూట ఎండ లు తీవ్రంగా ఉండడంతో మిషన్లు వేడెక్కుతున్నా యని, వాటిని చల్లబర్చేం దుకు కూలర్లను ఏర్పాటు చేస్తే మిషన్లు పాడవకుండా ఉంటాయని



ఆలోచించారు నిర్వాహకులు. అందుకే మిషన్ ప్యానల్స్ ఓపెన్ చేసి వాటి దగ్గర కూల ర్స్‌ను ఏర్పాటు చేశారు.ఒక్క చించోలిలోనే కాదు నిర్మల్ రూరల్ మండలం , లక్ష్మణచందా , దిల్వార్ పూర్ పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ మిషన్ల వద్ద ఇలా కూలర్లు దర్శనమిస్తు న్నాయి. ఇలా కూల్ కూల్‌గా మిషన్లను ఉంచక పోతే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంటుందంటు న్నారు బంకుల నిర్వహ కులు. పెట్రోల్ కోసం వస్తున్న వాహనదారులు సైతం ఆ చల్లదనం కోసం బంకులో కాసేపు సేద తీరుతూ..నిర్వహకులను అభినందిస్తున్నారు.

# మంగ్లీకి మరో షాక్ ఇచ్చిన అడ్వొకేట్ సుబ్బారావు.. ఈ ట్విస్ట్ ఏంటయ్యో!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 16**

సింగర్ మంగ్లీ కేసులో రోజుకో ట్విస్ట్ బయటికి వస్తోంది. ఇందులో ఎవరిది తప్పుంది? ఎవరు ఏంటి? అనేది పోలీసులు, కోర్టులు చూసుకుంటాయి కానీ, ఈలోపు కావాల్సినంత ఆసక్తిని ఈ కేసు జనాలకు కలిగిస్తోంది. ఈ కేసు విషయంలో సింగర్ మంగ్లీ అండ్ టీమ్‌పై మైక్రో ఫైనాన్స్ పేరిట భారీగా మోసం చేశారని.. మొదట న్యాయవాది సుబ్బారావు కొన్ని ఆరోపణలు చేస్తూ, పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదైన అనంతరం సింగర్ మంగ్లీ మీడియా ముందుకు వచ్చి, తనకేం తెలియదని, ఆ సుబ్బారావు అనే అతనే, బిగ్ బాస్‌కు వెళ్లే క్రమంలో ఫేమస్ అయ్యేందుకు ఇదంతా చేస్తున్నాడనేలా, ఆమె వెర్షన్ వినిపించారు. దీంతో, అసలేం జరుగుతోందో? అని అంతా కన్ఫ్యూజన్‌లో పడిపోయారు.ఆ తర్వాత న్యాయవాది సుబ్బారావును స్టేషన్‌కు పిలిచినప్పుడు, ఆయనకు నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో పాజిటివ్ (తక్కువ మోతాదులోనే) రావడంతో, ఈ కేసులో న్యూ ట్విస్ట్ ఏర్పడింది. ఒక్కసారిగా మంగ్లీ చెప్పేవన్నీ నిజమే అనుకునేలా పరిస్థితులు మారిపోయాయి. ఈ చర్యలను అవమానకరంగా భావించిన సుబ్బారావు, మరో ప్లాన్‌ను అమలు చేశారు. సింగర్ మంగ్లీ స్కామ్‌లోని బాధితులను రంగంలోకి దింపారు. దీంతో ఈ కేసు మరింత ఆసక్తికరంగా మారింది. బాధితులు నేరుగా మీడియా ముందుకు రావడం, వారి బాధను తెలియజేయడంతో.. సింగర్ మంగ్లీకి సుబ్బారావు షాక్ ఇచ్చినట్లయింది.ఇక బాధితులు మీడియా ముందు మాట్లాడుతూ.. గత ఆరు నెలల నుంచి ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, ఎక్కడికి వెళ్లాలో తెలియక చివరకు అడ్వొకేట్ సుబ్బారావును ఆశ్రయించామని బాధితులు తమ గోడును వినిపించారు. సింగర్ మంగ్లీ ఈ విషయంలో మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ, మంగ్లీకి ఉన్న హోదా వల్ల ఆమె మాటలకు ప్రాముఖ్యత లభిస్తోందని, కానీ తాము సామాన్య గృహిణులమని ఆవేదన వ్యక్తం చేశారు. నెట్‌వర్క్ మార్కెటింగ్ పేరుతో మధు అనే వ్యక్తి తమకు పరిచయమయ్యాడని, ఐదు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి మోసపోయామని ఓ బాధిత మహిళ తెలిపారు. మంగ్లీ సోదరిని వివాహం చేసుకోబోతున్న వ్యక్తి ద్వారానే ఈ పెట్టుబడి వివరాలు తెలిశాయని ఆమె పేర్కొంది. ప్రారంభంలో 5 శాతం లాభం ఇస్తామని నమ్మబలికి, ఆ తర్వాత ల్యాండ్ ఇస్తామని చెప్పి తమను నమ్మించారని బాధితురాలు వెల్లడించింది..




# వివాహేతర సంబంధం కోసం భర్తను సజీవ దహనం చేసిన భార్య

**ప్రియుడు, సుపారీ గ్యాంగ్ తో కలిసి పాశవిక హత్య పరకాలలో సంచలనం**

**మన దునియా హనుమకొండ జిల్లా పరకాల: ఏప్రిల్ 16**




హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన మడికొండ సుమన్ (35) ఈనెల 3వ తేదీ నుంచి కనిపించకుండా పోవడం స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.దర్యాప్తులో బయటపడిన విషయాలు షాకింగ్‌గా మారాయి. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సుమన్‌ను అతని భార్య లావణ్య అత్యంత పాశవికంగా హత్య చేయించినట్లు పోలీసులు గుర్తించారు.సుమన్ భార్య లావణ్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని తెలిసింది. ఈ నేపథ్యంలో భర్తను అడ్డంకిగా భావించిన లావణ్య, తన ప్రియుడితో కలిసి కుట్ర పన్నింది.ప్రియుడు సహా మరో 8 మంది సుపారీ గ్యాంగ్ సభ్యులను తీసుకొని ఈనెల 4న ములుగు జిల్లా దయ్యాలవాగు సమీపానికి సుమన్‌ను తీసుకెళ్లి, అతనిపై పెట్రోల్ పోసి సజీవ దహనం చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. కేసు నమోదు చేసి నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# రానున్న మూడు రోజుల్లో మరింత ఎండలు!

**మధ్యాహ్నం వేళ బయటికి రావద్దని వాతావరణ శాఖ హెచ్చరిక!**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్17**




తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా ఎండలు మండిపోతు న్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటగా, రానున్న మూడు రోజుల్లో ఇవి మరో 1 నుంచి 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎండలతో పాటు వడ గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక లు జారీ అయ్యాయి. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామా బాద్, ఖమ్మం, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీయవచ్చు... ఈరోజు ఉమ్మడి ఆదిలా బాద్ తో పాటు నాగర్ కర్నూల్, వనపర్తి, నారా యణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా. ఈ జిల్లాలకు 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవస రమైతే తప్ప బయటకు రాకూడదని నిపుణులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగుతూ ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ విజ్ఞప్తి చేసింది.

# ఫెయిల్ భయంతో బోర్డుకు విద్యార్థి ఫోన్ అధికారుల కౌన్సెలింగ్

**మన దునియా,విశాఖపట్నం: ఏప్రిల్ 16**

ఫలితాల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఓ ఇంటర్ విద్యార్థి బోర్డు అధికారులకు ఫోన్ చేసి సహాయం కోరిన ఘటన విశాఖపట్నంలో చోటుచేసుకుంది. విద్యార్థి ఆందోళనను గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి, ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చి ధైర్యం చెప్పారు.వివరాల్లోకి వెళితే, విశాఖకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఒకరు ఫలితాలకు ముందు బోర్డు అధికారులకు ఫోన్ చేశాడు. పరీక్షల్లో తాను సరిగా చదవలేదని, జవాబు పత్రంలో ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశానని తెలిపాడు. ఫలితాల్లో ఫెయిల్ అవుతాననే భయంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు అధికారులకు వివరించాడు.విద్యార్థి పరిస్థితిని అర్థం చేసుకున్న అధికారులు అతనికి ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. కంగారు పడాల్సిన అవసరం లేదని, త్వరలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, వాటికి బాగా సిద్ధమవ్వాలని సూచించారు. అలాగే ఈ విషయాన్ని సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కాగా, అనంతరం విడుదలైన ఫలితాల్లో ఆ విద్యార్థి మొత్తం ఐదు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తేలింది. ప్రస్తుతం విద్యార్థి ఇంట్లోనే సురక్షితంగా ఉన్నాడని, భవిష్యత్తులో బాగా చదివేలా చూసుకుంటామని అతని తల్లిదండ్రులు అధికారులకు హామీ ఇచ్చారు.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

**రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**ములుగు జిల్లా ఏప్రిల్ 16 మన దునియా**



గోవిందరావుపేట మండలంలోని చల్వాయి గ్రామంలో గురువారం రామాంజలి వివో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చల్వాయి సర్పంచ్ మేకల రాధా సుదర్శన్ ప్రారంభించారు రవి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ సూచించారు రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బురెడ్డి మధుసూదన్ రెడ్డి ఏబీఎం సీతారామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడాకుల కృష్ణమూర్తి మాజీ ఎంపిటిసి గుండెబోయిన నాగలక్ష్మి రామాంజలి వివో అధ్యక్షురాలు నర్రా విజయలక్ష్మి మహిళా సంఘాల ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు

# చాక్లెట్ ఆశ చూపి యాసిడ్ తాగించింది

**నాలుగేళ్ల బాలుడిపై పిన్ని కర్కశం!**

**మన దునియా,ఘట్‌కేసర్:ఏప్రిల్16**



ఘట్‌కేసర్: కుటుంబ కలహాలు చిన్నారి ప్రాణాలపై దాడికి దారి తీసిన అమానుష ఘటన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో వెలుగుచూసింది. తన కొడుకును ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే కారణంతో, తోడి కోడలి నాలుగేళ్ల కుమారుడిపై ఓ మహిళ దారుణానికి ఒడిగట్టింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి బాలుడికి యాసిడ్ తాగించింది. కొద్దిసేపటికే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురవడంతో విషయం గమనించిన తల్లిదండ్రులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాలుడి తల్లి మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ విభేదాలు ఇంత దారుణానికి దారి తీసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ.. రూ.10 లక్షల బిల్లు పాస్ చేసేందుకు రూ.30 వేల డిమాండ్:

**మన దునియా,నల్గొండ జిల్లా దేవరకొండ:ఏప్రిల్:16**

విద్యుత్ లైన్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లును మంజూరు చేసేందుకు లంచం ఆశించిన నల్గొండ జిల్లా దేవరకొండ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో అక్టోబర్ 2025లో వీచిన గాలివానకు దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఓ వ్యక్తి పునరుద్ధరించాడు. ఇందుకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపేందుకు సదరు ఏడీఈ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, ఏప్రిల్ 16న తన కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా సైదులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.




# ప్రజా పాలన సభలో రసాభాస:అధికారులను నిలదీసిన బిఆర్ఎస్.. కాంగ్రెస్ నేతల ఎదురుదాడి!





**ఖానాపూర్ ఆర్సి మన దునియా ఏప్రిల్:16.**

ఖిపెంబి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి నివేదన' సభ రసాభాసగా మారింది.రైతుల సమస్యలపై అధికారులను ప్రశ్నించిన బిఆర్ఎస్ నాయకులకు,అధికార పార్టీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.అధికారుల బాధ్యతారాహిత్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష నేతలు నిరసనకు దిగడంతో సభ అర్ధాంతరంగా ముగిసింది.

**ప్రశ్నల వర్షం కురిపించిన బిఆర్ఎస్ నాయకులు:-**

సభ ప్రారంభం కాగానే బిఆర్ఎస్ నాయకులు రైతుల పెండింగ్ సమస్యలపై అధికారులను నిలదీశారు.గత ఏడాది ఏసంగిలో పండించిన సన్న వడ్లకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదని మండిపడ్డారు.గత రెండు సీజన్లకు సంబంధించిన రైతు బంధు (రైతు భరోసా) నిధులు రాలేదని,ప్రస్తుత సీజన్‌లో కేవలం ఒక ఎకరానికి మాత్రమే నిధులు వేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.మిగిలిన రైతులకు ఏప్రిల్ 15 లోపు నిధులు జమ చేస్తామని హామీ ఇచ్చి,గడువు దాటినా ఎందుకు వేయలేదని అధికారులను నిలదీశారు.

**అధికార గర్వంతో కాంగ్రెస్ నేతల సమాధానం?**

బిఆర్ఎస్ నాయకుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనం వహించగా,అధికార పార్టీ (కాంగ్రెస్) నాయకులు జోక్యం చేసుకున్నారు."మేము ఇచ్చినప్పుడే తీసుకోవాలి..అప్పటి వరకు సైలెంట్ గా ఉండాలి" అంటూ కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడికి దిగడం అక్కడ ఉద్రిక్తతకు దారి తీసింది."ఇస్తే తీసుకోవాలి..లేదంటే మూసుకుని కూర్చోవాలి" అంటూ అధికారులు,అధికార పార్టీ నేతలు దురుసుగా ప్రవర్తించారని బిఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి.

**సభ మధ్యలోనే వెళ్ళిపోయిన అధికారులు:-**

ప్రశ్నలకు సమాధానం చెప్పలేక,పెరుగుతున్న ఉద్రిక్తతను చూసి అధికారులు మీటింగ్‌ను మధ్యలోనే వదిలేసి వెళ్ళిపోవడం గమనార్హం.ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన వేదికపై అధికార అహంకారంతో ప్రవర్తించడం సరికాదని రైతులు మరియు ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# ములుగు జిల్లావాజేడు లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 17 గ్రామపంచాయతీ సర్పంచులతో మహాసభ వాజుడులో









**మన దునియా, వాజేడు,ఏప్రిల్,16**

ములుగు జిల్లా వాజేడు మండలం వాజేడు హై స్కూల్ లో 99 రోజుల ప్రజా పా లన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు పాలకవర్గం సభ్యులు వార్డు మెంబర్స్ పంచాయితీ కార్యదర్శి తో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో సమావేశానికి ప్రత్యేక అధ్యక్ష వహించిన వాజేడు సర్పంచ్ సభ ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎంపీడీవో తాసిల్దార్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఇరిగేషన్ రోడ్లు భవనాలు శాఖల అసిస్టెంట్ ఇంజనీర్లు సూపర్వైజర్ ఏపీఎం ఏపీఓ మండల విద్యాధికారి తదితరులు హాజరయ్యారు ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు శాఖల వారి పతకాల వివరాలు తెలియజేసి వారి తో చర్చించారు కొత్త ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలను సంబంధించిన ఆమోదించారు కార్యక్రమంలో భాగంగా ఆక్సిడెంట్ జరగకుండా




జాగ్రత్త తీసుకోవాలని పేరూరు ఎస్సై చెప్పారు మరియు మైనరు 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని తెలిపారు

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# రేపు లోక్ సభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక!

**మన దునియా,న్యూఢిల్లీ:ఏప్రిల్ 16**

ఈరోజు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమ య్యాయి. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, నారీశక్తి వందన్ చట్టసవ రణ, డీలిమిటేషన్ బిల్లు లను కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే బిల్లులపై ఇండియా కూటమి నేతలు తీవ్ర వ్యతిరేకతన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే శు క్రవారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికలను బహిష్కరిం చాలని భారత కూటమి పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి.ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీ అయింది. అయితే తిరిగి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇక హరివంశ్ ఏప్రిల్ 10న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే తాజాగా జరుగుతున్న ప్రత్యేక సమావేశాల్లో భాగంగా ఏప్రిల్ 17న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక చేపట్టనున్నారు. అయితే డిప్యూటీ చైర్మన్ రేసులో మళ్లీ హరివంశ్ పేరే ప్రము ఖంగా వినిపిస్తోంది. తిరిగి ఆయన్నే ఎన్నుకుంటారా? లేదంటే మరొకరికి ఛాన్స్ ఇస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ఇదిలా ఉంటే 2019 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. కానీ ఇటీవల ఖాళీ అయిన రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవిని



భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడుతుండడంతో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ నియామకాన్ని ప్రభుత్వం బలవంతంగా చేయించాలని చూస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది

# కులాల గుట్టు విప్పిన రేవంత్ సర్కారు

**రాష్ట్రంలో మొత్తం బీసీలు 56.33 శాతం ఇందులో ముస్లిం బీసీలు 10.08శాతం**

**మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 15**

తెలంగాణలో కులాల వివరాలన్నింటినీ రేవంత్ సర్కారు ఎట్టకేలకు బహిర్గతం చేసింది. గతేడాది ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా లెక్కలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం బుధవారం రాత్రి హడావుడిగా రాష్ట్రంలో ప్రతి కులం, జనాభా ఎంతో స్పష్టంగా తెలిపే సమాచారాన్ని వెల్లడించింది. కులగణనలో సేకరించిన ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ రంగాల్లో ఏ కులం ఏ స్థానంలో ఉందో స్పష్టం చేసే గణాంకాలను ప్రజల ముందు ఉంచింది. స్థూలంగా చూస్తే... రాష్ట్రవ్యాప్తంగా మొత్తం జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారు. ఇందులో 10.08 శాతం వెనకబడిన ముస్లింలు ఉన్నారు. ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతం ఉన్నట్లు తెలిపింది. ఓసీల్లో జనాభా పరంగా రెడ్లదే అగ్రస్థానం. ఓసీల్లో వారు 30.47 శాతం ఉన్నారు. తర్వాతి స్థానంలో ఓసీ ముస్లింలు 11.08 ఉండగా.. వైశ్యులు 9.07 శాతం, కమ్మవారు 6.56 శాతం ఉన్నారు. బ్రాహ్మణులు 5.98 శాతం, వెలమలు 2.56 శాతం ఉన్నారు. కాగా, కులం పేరు వెల్లడించనివారు ఓసీల్లో 21.49 శాతం ఉండటం విశేషం. వీరు మొత్తంగా 12 లక్షల పైచిలుకు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. విద్య, ఉద్యోగాలు, భూములు, ఇళ్లు, కార్లు, ఇలాంటి వాటిలో అగ్రకులాల వారే ముందున్నారు. వీరిలో భూములు అత్యధికంగా రెడ్ల చేతిలో ఉన్నాయి. ఆ తరువాత వరుసగా యాదవ, లంబాడ, ముదిరాజ్, మాదిగ, మున్నూరుకాపులు అత్యధిక భూములు కలిగి ఉన్నారు.

56 ప్రధాన కులాల మధ్య భారీ అసమానతలు..

వెనుకబాటుతనం పరంగా రాష్ట్రంలోని 56 ప్రధాన కులాల మధ్య భారీ అసమానతలు ఉన్నాయి. బీసీల్లోని కొన్ని వర్గాలైతే సామాజికంగా, ఆర్థికంగా ఓసీ వర్గాలతో సమాన స్థాయిలో ఉన్నట్లు వెల్లడించింది. రాష్ట్ర వెనుకబాటుతనం సగటుతో పోల్చితే ఎస్సీ క్రైస్తవులు, కంసాలీలు మెరుగైన స్థాయిలో ఉన్నారు. కాగా, కులాంతర వివాహాలు చేసుకుంటున్నవారు అన్ని కులాల్లోనూ పెరుగుతున్నారు. ఈ వివరాలన్నిటినీ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం విడుదల చేశారు. ప్రజలు ఈ వివరాలను 'డీఈఎస్ తెలంగాణ డాట్ జీవోవీ డాట్ ఇన్' నుంచి పొందవచ్చని వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయడం అసాధ్యమని గతంలో మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రకటించిందని, తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించిన తర్వాత ఇప్పుడు దేశవ్యాప్త కులగణనకు అయిష్టంగానైనా సిద్ధమైందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున.. తెలంగాణ కులగణనపై పార్లమెంటులో చర్చ జరగాలని ఈ వివరాలను ప్రజలకు



అందుబాటులోకి తెచ్చామని మంత్రి పొన్నం తెలిపారు.

అత్యధిక జనాభా ఉన్న కులాలు

కులం – జనాభా (శాతం)

మాదిగ 36,57,551 (10.3శాతం)

ముదిరాజ్ 26,39,027 (7.4శాతం)

లంబాడీ/బంజారా 24,04,056 (6.8శాతం)

యాదవ 20,18,725 (5.7శాతం)

రెడ్డి 17,10,244 (4.8శాతం)

గౌడ 16,30,187 (4.6శాతం)

మాల 14,71,514 (4.1శాతం)

మున్నూరుకాపు 13,75,018 (3.9శాతం)

పద్మశాలి 11,82,252 (3.3శాతం)

వర్గాల వారీగా మొత్తం జనాభా

విభాగం జనాభా శాతం

ఎస్సీ 61,84,319 17.43

ఎస్టీ 37,05,929 10.45

బీసీ (ముస్లిం మినహా) 1,64,09,179 46.25

ముస్లిం మైనార్టీ (బీసీ) 35,76,588 10.08

ముస్లిం మైనార్టీ (ఓసీ) 8,80,424 2.48

ముస్లిం మైనార్టీ (మొత్తం) 44,57,012 12.56

ఓసీ (ముస్లిం మైనార్టీ) 8,80,424 2.48

ఇతర ఓసీలు 47,21,115 13.31

మొత్తం ఓసీలు 56,01,539 15.79..

# పిరమైన కూరగాయల ధరలు!




**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 16**

ఉన్నట్లుండి కూరగాయల ధరలు అమాంతం పెరిగిపో వడంతో ఎలా కొనాలి? ఏమి తినాలి అనే ఆలోచనలో పడ్డారు. సామాన్యులు అకాల వర్షాల వల్ల పంటకు నష్టం జరగడం, వేసవి కాలం క్రమంలో ధరలు ఆమాం తం పెరుగుతున్నాయి. కొన్నిచోట్ల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను పెంచేస్తున్నారు. దీంతో ఇప్పుడు కూరగాయల ధరలు రెండింతలు పెరిగాయి.టమాటా ధరలు మళ్లీ పెరిగాయి. ఇటీవల కిలో రూ.10కి లభించగా.. ఇప్పుడు రూ.20కిపైగా పలుకుతున్నాయి.ప్రస్తుతం హైదరాబాద్‌లోని కూకట్ పల్లి రైతు బజార్‌లో కేజీ టమాటా రూ.23, వంకా య రూ.18, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, బజ్జిమిర్చి రూ.21, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.11, బీన్స్ రూ.60, క్యారెట్ రూ.23, గోబిపువ్వు రూ.25, దొండకాయ రూ.23, చిక్కుడుకాయ రూ.50, గోరుచిక్కుడు రూ.28కి లభిస్తోంది. ఇక కేజీ బీట్ రూట్ రూ. 23, క్యాప్సికం రూ.33, ఆలుగడ్డ రూ.17, కీర రూ.18, దోసకాయ రూ.13, సొరకాయ రూ. 15,. పొట్లకాయ రూ.18, కంద రూ.30, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.18, చామగడ్డ రూ.28, చిలకడదుంప రూ.25, పచ్చిబఠాణి రూ.40, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.45, ఎండుమిర్చి రూ.260 పలుకుతున్నాయి.

# తల్లడి నవ్య జ్ఞాపికకు ఎంబీబీఎస్ హాస్టల్ ఫీజ్ కోసం

**ఆమె చదువుకున్న స్కూల్ నుండి 50,000 ఆర్థిక సాయం**

**మన దునియా, వాజేడు,ఏప్రిల్,16**



ఆశ్రమ బాలికల గిరిజన ఉన్నత పాఠశాల పెద్ద గొల్ల గూడెం తల్లడి నవ్య జ్ఞాపిక ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివి 2022-2023 ఏ సంవత్సరంలో ఎస్ఎస్సి మండల్ టాపర్గా నిలిచింది దేవరకొండ సీ ఓ ఈ కాలేజ్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి 20 24-2025 నీట్ ఎగ్జాం రాసి కరీంనగర్లోని షాలిమెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో సీటు పొంది ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతుంది తన హాస్టల్ ఫీజుకు కట్టడానికి ఇబ్బంది పడుతున్న నిరుపేద ఆదివాసి గిరిజన కుటుంబానికి చెందిన నవ్య జ్ఞాపకకు పెద్ద గొల్లగూడెం స్టాఫ్ మరియు ప్రధాన ఉపాధ్యాయులు ఐ టి డి ఏ నాగారం డిప్యూటీ డైరెక్టర్ దబ్బ కట్ల జనార్ధన్ రావు ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్పా కేశవరావు మరియు పూనెంరోజా రాణి పాయం తిరుపతమ్మ పెండేకట్ల బుచ్చిబాబు తోలేం కృష్ణయ్య అట్టం రామారావు కోడి భారతి యాలం ఉమాదేవి సొడె రాంబాబు గుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు

# నేడు లోక్ సభలో మూడు ప్రధాన బిల్లులపై చర్చ!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 16**

దేశ రాజకీయాలను కీలక మలుపు తిప్పే అవకాశం ఉన్న మూడు ప్రధాన బిల్లులను కేంద్ర ప్రభుత్వం లోకసభలో ప్రవేశ పెడు తుంది, మహిళ రిజర్వేషన్ అమలు, నియోజకవర్గంల పునర్విభజన, కొత్త డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు వంటి అంశాలను కలిగి ఉన్న ఈ బిల్లులపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది, నేటి నుంచి మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నా యి.ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు, నారీశక్తి వందన్ చట్టసవర ణ, డీలిమిటేషన్ వంటి కీలక బిల్లులపై చర్చ జరగనుంది. 2023లో ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ చట్టమైన నారీ శక్తి వందన్ చట్టాన్ని పూర్తి గా అమలు చేయడమే ఈ బిల్లుల లక్ష్యం. 2029 నాటికి మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడం, లోక్‌సభలో సభ్యుల సం ఖ్యను 850కు పెంచడమే మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది.మహిళా రిజర్వేషన్ బిల్లు, నారీశక్తి వందన్ చట్టసవరణ బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెడుతుండగా.. మూడో బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టనున్నారు. లోక్ సభలో 18 గంటల పాటు చర్చ చేపట్టనున్నారు. అనంతరం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ 10 గంటల పాటు చర్చ చేపట్టనున్నారు.ఇదిలా ఉంటే డీలిమిటేషన్ బిల్లును ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకి స్తోంది. అంతేకాకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కేంద్రం దురుద్దేశం తోనే తీసుకొస్తోందని ఆరోపించింది. అయితే బిల్లులపై ఇండియా కూటమి వర్సెస్ ఎన్డీఏ కూటమి మధ్య యుద్ధం జరిగే సూచనలు కనిపిస్తు న్నాయి. మూడు రోజుల ప్రత్యేక సమావేశాల్లో బిల్లులు ఆమోదం పొందుతాయా? లేదా?అన్నది వేచి చూడాలి.!



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము. ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్ధం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది. వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.


# శారీరక సంబంధం కోసం దారుణం..

**ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య**

**హన్మకొండ జిల్లా, పరకాలలో దారుణం**

**ఆధారాలు దొరక్కుండా పెట్రోల్ పోసి తగులబెట్టిన నిందితులు**

**భార్య, ప్రియుడు సహా ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు**



మన దునియా హన్మకొండ జిల్లా, పరకాల:ఏప్రిల్ 16


హన్మకొండ జిల్లా,పరకాలలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. భర్తను అతి కిరాతకంగా చంపి, ఆధారాలు దొరక్కుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పరకాలకు చెందిన సుమన్ ఒక రెస్టారెంటులో పని చేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు. భార్యకు కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో తన భర్తను వదిలించుకోవాలనుకున్న లావణ్య, ప్రియుడితో కలిసి చంపేందుకు ప్లాన్ వేసింది. ఇందుకోసం ఒక ముఠాకు సుఫారీ ఇచ్చింది. ఈ క్రమంలో ఆమె కొద్దిరోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. ఆ తర్వాత, ఈ నెల 3వ తేదీ నుంచి భర్త సుమన్ కనిపించకుండా పోయాడు. కొడుకు కోసం వెతికిన సుమన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్యపై అనుమానం వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ జరపగా, ప్రియుడితో కలిసి భర్తను చంపినట్లు అంగీకరించింది. సుఫారీ గ్యాంగ్ మొదట అతనిని బీరు సీసాలతో విచక్షణారహితంగా పొడిచి చంపింది. ఈనెల 4వ తేదీన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దయ్యాలవాగు సమీపంలో సుమన్‌పై పెట్రోల్ పోసి కాల్చివేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ఆ తర్వాత ఎనిమిది మందిని అరెస్టు చేశారు. లావణ్యతో పాటు ప్రియుడు, సుఫారీ తీసుకున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు

## ఈ పండ్లను పొరపాటున కూడా ఫ్రిడ్జ్‌లో పెట్టకండి..



రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాక.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే రోజూ తీసుకోవాల్సినవే. అయితే కొందరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు ఫ్రిడ్జ్ సహాయాన్ని తీసుకుంటారు. కానీ కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచడం వల్ల పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాదు వాటి సహజమైన రుచి, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేసవిలో ఎక్కువగా కనిపించే పుచ్చకాయను చాలా మంది ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తారు. కానీ దీని తేమ, పోషక విలువలు గది ఉష్ణోగ్రతలోనే బాగుంటాయి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు ఇందులో ఉండే లైకోపిన్, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పని చేయలేకపోతాయి. అందువల్ల పుచ్చకాయను ఫ్రిడ్జ్ లో కాకుండా గది ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి. మార్కెట్‌లో లభించే మామిడిపండ్లలో చాలా భాగం ఇథలీన్ వాయువుతో మగ్గించబడుతుంటాయి. అలాంటి పండ్లు ఫ్రిడ్జ్ లో ఉంచితే అవి త్వరగా నల్లబడిపోతాయి. మామిడి ఇంకా మగ్గని దశలో ఉంటే గది ఉష్ణోగ్రతే మంచి పరిష్కారం. పండిన తరువాత కొంతసేపు నిల్వ ఉంచాలంటే ఫ్రిడ్జ్ లో పెట్టవచ్చు కానీ ఎక్కువసేపు ఉంచకపోవడం ఉత్తమం. అరటిపండ్లను చల్ల ప్రదేశాల్లో ఉంచినప్పుడు అవి త్వరగా రంగు మారి నలుపు అవుతాయి. ఫలితంగా అందవిహీనంగా మారిపోతాయి. పైగా రుచి కూడా తగ్గిపోతుంది. కనుక అరటిపండ్లను గదిలో ఉంచితేనే అవి సన్నగా ఉండి రుచికరంగా ఉంటాయి. పండని అవకాడోను ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు అది సమయానికి మగ్గకపోవచ్చు. కాస్త మగ్గిన తర్వాత ఫ్రిడ్జ్‌లో ఉంచితే కొంతకాలం నిల్వ ఉంటుంది. కానీ రుచి మెత్తబడకుండా ఉండాలంటే గది ఉష్ణోగ్రతే మేలు చేస్తుంది. చల్లదనంలో ఉంచిన ద్రాక్ష పండ్లు తేమ కోల్పోయి త్వరగా వాడిపోతాయి. ఫలితంగా రుచి తగ్గిపోతుంది. గది ఉష్ణోగ్రతలో ఉంచితే ఇవి తాజాగా ఉంటాయి. అయితే ఎక్కువ రోజులు నిల్వ ఉంచే అవసరం ఉంటే ఎయిర్‌టైట్ డబ్బాలో వేసి ఫ్రిడ్జ్ లో పెట్టడం మంచిది. పీచ్ పండ్లు సున్నితంగా ఉండే తేమతో నిండినవి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు వాటి తేమ తగ్గిపోతుంది. దీని వల్ల చర్మం కఠినంగా మారి రుచి బాగా తగ్గిపోతుంది. సహజంగా మగ్గే అవకాశం ఉండే స్థలంలో ఉంచడం ఉత్తమం. పైనాపిల్ పండిన తర్వాత గది ఉష్ణోగ్రతలోనే ఉంచడం మంచిది. చల్లదనంలో ఉంచినప్పుడు దీనిలోని తేమ పోయి రుచి తగ్గిపోతుంది. అయితే పూర్తిగా మగ్గిన పైనాపిల్ ముక్కలను ఫ్రిడ్జ్‌లో తక్కువ సమయం ఉంచితే హానికరం కాదు. బాదం, జీడిపప్పు, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్‌ను ఫ్రిడ్జ్‌లో ఉంచినప్పుడు అవి తేమతో తడిసిపోతాయి. ఫలితంగా ఫంగస్ ఏర్పడి రుచి మారుతుంది. ఇవి పొడి ప్రదేశంలో గాలి చొరబడకుండా ఉండే డబ్బాలో ఉంచడం ఉత్తమం. పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదే. కానీ వాటిని ఎలా నిల్వ ఉంచుతున్నామనేది కూడా ముఖ్యం. ప్రతి పండుకు తగిన ఉష్ణోగ్రత అవసరం ఉంటుంది. కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో పెట్టడం వల్ల వాటి పోషకాలు తగ్గిపోతాయి. కాబట్టి పండ్లు ఫ్రెష్‌గా, ఆరోగ్యకరంగా ఉండాలంటే వాటి లక్షణాలను బట్టి నిల్వ చేసే తీరు మార్చుకోవాలి.

## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?



ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ వీ ు ద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ । శుక్రవారం । 17 । 2026



# దడదడలాడించిన పంజాబ్ కింగ్స్... ముంబై ఖాతాలో మరో ఓటమి

**ముంబై ఇండియన్స్‌పై 7 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ ఘన విజయం**

**క్వింటన్ డికాక్ అద్భుత సెంచరీ (112ð) వృథా**

**లక్ష్య ఛేదనలో చెలరేగిన ప్రభ్‌సిమ్రన్ సింగ్ (80ð), శ్రేయస్ అయ్యర్ (66)**

**అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్ (3/22)**

**ఈ విజయంతో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌ను పదిలం చేసుకున్న పంజాబ్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో పంజాబ్ చిత్తుగా ఓడించింది. ముంబై నిర్దేశించిన 196 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80ð), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (35 బంతుల్లో 66) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో పంజాబ్‌కు మరపురాని విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో పంజాబ్ పాయింట్ల పట్టికలో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. 196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. అయితే, 45 పరుగులకే ప్రియాన్ష్ ఆర్య (15), కూపర్ కానలీ (17) వికెట్లను కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కేవలం 66 బంతుల్లోనే 139 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీల వర్షం కురిపించారు. ప్రభ్‌సిమ్రన్ ఆఖరి వరకు నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించాడు. ముంబై బౌలర్లు పూర్తిగా తేలిపోయి భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అంతకుముందు, ఈ పోరులో పంజాబ్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దాంతో బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇన్నింగ్స్ ఆరంభంలోనే తడబడింది. 12 పరుగులకే రియాన్ రికెల్టన్ (2), సూర్యకుమార్ యాదవ్ (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ క్వింటన్ డికాక్ అద్వితీయ పోరాటం చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో పాతుకుపోయి పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతనికి నమన్ ధిర్ (31 బంతుల్లో 50) చక్కటి సహకారం అందించడంతో ముంబై కోలుకుంది. డికాక్ కేవలం 60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో అజేయంగా 112 పరుగులు సాధించాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ కేవలం 22 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ముంబైని కట్టడి చేశాడు. పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌లలో 4 విజయాలు నమోదు చేసింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ప్రస్తుతం పంజాబ్ 9 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది.



# టాస్ గెలిచిన పంజాబ్.. సమస్యలతో సతమతమవుతున్న ముంబై

**టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్**

**ముందుగా బ్యాటింగ్ చేయనున్న ముంబై ఇండియన్స్**

**గాయం కారణంగా రోహిత్ శర్మ పలు మ్యాచ్‌లకు దూరం**

**మిచెల్ శాంట్నర్ కు అనారోగ్యం**


**ముంబై జట్టులోకి డికాక్, అరంగేట్రం చేస్తున్న మయాంక్ రావత్**

**గత మ్యాచ్ ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతున్న పంజాబ్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌కు టాస్ కలిసిరాలేదు. టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో హార్దిక్ పాండ్యా సేన తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఇప్పటికే వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై జట్టుకు ఈ మ్యాచ్‌కు ముందు గాయాల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను కోలుకోవడానికి కొన్ని మ్యాచ్‌ల సమయం పడుతుందని కెప్టెన్ హార్దిక్ పాండ్యా స్పష్టం చేశాడు. అదే సమయంలో, ఆల్ రౌండర్ మిచెల్ శాంట్నర్ కూడా అనారోగ్యంతో అందుబాటులో లేదని తెలిపాడు. వారి స్థానంలో క్వింటన్ డికాక్ జట్టులోకి తిరిగి రాగా, యువ ఆటగాడు మయాంక్ రావత్ అరంగేట్రం చేస్తున్నాడు. టాస్ గెలిచిన అనంతరం శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. పిచ్ పొడిగా ఉన్నప్పటికీ, మంచు ప్రభావంతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సులభం అవుతుందని భావించి బౌలింగ్ ఎంచుకున్నట్లు చెప్పాడు. తాము ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతున్నామని అన్నాడు. మరోవైపు హార్దిక్ పాండ్యా, తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామని, గత మ్యాచ్‌లో బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, ఈ మ్యాచ్‌లో ఆ తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటామని పేర్కొన్నాడు.

జట్ల వివరాలు:

పంజాబ్ కింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), ప్రియాన్ష్ ఆర్య, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), కూపర్ కనొల్లీ, శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, విజయ్‌కుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్. ముంబై ఇండియన్స్: క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), ర్యాన్ రికెల్టన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, నమన్ ధీర్, మయాంక్ రావత్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, జస్ప్రీత్ బుమ్రా.



# పంజాబ్ బౌలర్లను ఉతికారేసిన డికాక్... 112 నాటౌట్



**వాంఖడేలో చెలరేగిన ముంబై ఓపెనర్ క్వింటన్ డికాక్**

**60 బంతుల్లో 112 పరుగులతో అజేయ సెంచరీ**

**ఆరంభంలో వికెట్లు కోల్పోయినా.. జట్టును ఆదుకున్న డికాక్**

**నమన్ ధీర్ (50)తో కలిసి 122 పరుగుల భారీ భాగస్వామ్యం**

**పంజాబ్ కింగ్స్ ముందు 196 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన ముంబై**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ క్వింటన్ డికాక్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. సొంత మైదానం వాంఖడే స్టేడియంలో ఆకాశమే హద్దుగా చెలరేగి, ఒంటిచేత్తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ముంబైని తన అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. డికాక్ వీరోచిత ఇన్నింగ్స్ ఫలితంగా ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన మూడో ఓవర్‌లో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (2), వన్‌డౌన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (0) వరుస బంతుల్లో ఔటయ్యారు. దీంతో ముంబై 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలబడిన డికాక్, మరో యువ ఆటగాడు నమన్ ధీర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 122 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. నమన్ ధీర్ 31 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 పరుగులు చేసి డికాక్‌కు అండగా నిలిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా డికాక్ మాత్రం ఒంటరి పోరాటం కొనసాగించాడు. ఆరంభంలో నెమ్మదిగా ఆడినా, క్రీజులో కుదురుకున్న తర్వాత పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మైదానం నలువైపులా అద్భుతమైన షాట్లతో అలరించాడు. కేవలం 60 బంతులు ఎదుర్కొని 8 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 112 పరుగులు చేసి చివరి వరకు అజేయంగా నిలిచాడు. అతని బాధ్యతాయుతమైన, విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగానే ముంబై ఈ భారీ స్కోరు చేయగలిగింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (14) పరుగులు చేశాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4 ఓవర్లలో కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించాడు. మిగతా బౌలర్లు మాత్రం ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

# సన్ రైజర్స్ కు ఎదురుదెబ్బ... గాయంతో సీజన్ మొత్తానికి దూరమైన కొత్త బౌలర్


**గాయం కారణంగా ఐపీఎల్ సీజన్‌కు దూరమైన డేవిడ్ పేన్**

**రెండు మ్యాచ్‌లు ఆడిన పేన్.. 14 ఎకానమీతో కేవలం రెండు వికెట్లు**

**ఫిట్‌నెస్ టెస్టులో పాసై జట్టులోకి రానున్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్**

**పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్న సన్‌రైజర్స్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా మిగిలిన సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్‌ఆర్‌హెచ్ ఫ్రాంచైజీ 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించింది. అయితే, అతని స్థానంలో ఎవరినీ భర్తీ చేస్తున్నట్లు ఇంకా వెల్లడించలేదు. సీజన్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా పేసర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయపడటంతో అతని స్థానంలో డేవిడ్ పేన్‌ను ఎస్‌ఆర్‌హెచ్ జట్టులోకి తీసుకుంది. పేన్ బిగ్ బాష్ లీగ్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, ఐపీఎల్‌లో మాత్రం ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. ఎస్‌ఆర్‌హెచ్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడి, 14 ఎకానమీ రేటుతో కేవలం రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ప్రస్తుతం ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో 5 మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్, రెండింటిలో గెలిచి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్‌పై 57 పరుగుల తేడాతో ఎస్‌ఆర్‌హెచ్ ఘనవిజయం సాధించింది. ఇక తమ తదుపరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టు శనివారం నాడు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఇదిలా ఉండగా, సన్‌రైజర్స్ జట్టుకు ఓ శుభవార్త అందింది. గాయంతో దూరమైన రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. త్వరలోనే అతను జట్టుతో కలవనున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో కమిన్స్ ఆడే అవకాశం ఉంది. ప్రస్తుతం కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఇంటర్ లో 459/470 సాధించిన కార్తీకదీపం సీరియల్ చిన్నారి కృతిక

సోషల్ మీడియాలో మార్కుల మెమోను పంచుకున్న నటి

నటనతో పాటు చదువులోనూ రాణించడంపై వెల్లువెత్తిన ప్రశంసలు

'కార్తీకదీపం' సీరియల్‌తో తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటికీ పరిచయమైన 'శౌర్య' అలియాస్ బేబీ కృతిక (సహృద) చదువులోనూ తన సత్తా చాటింది. ఇటీవల విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆమె అద్భుతమైన మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. నటనలో రాణిస్తూనే, చదువులోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.వివరాల్లోకి వెళ్తే, తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షల్లో కృతిక ఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకు గానూ 459 మార్కులు సాధించింది. తన మార్కుల మెమోను ఆమె సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో ఈ విషయం వైరల్ అయింది.'కార్తీకదీపం' సీరియల్‌లో 'వంటలక్క', 'డాక్టర్ బాబు'ల కూతురిగా, 'రౌడీ'గా తన నటనతో కృతిక ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకపోవడంపై నెటిజన్లు, అభిమానులు ఆమెను అభినందిస్తున్నారు. కృతిక గతంలో 'సరిలేరు నీకెవ్వరు', 'రాగల 24 గంటల్లో' వంటి చిత్రాల్లోనూ బాలనటిగా నటించింది. ప్రస్తుతం ఆమె ఇంటర్ రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టనుంది.

# మంచిర్యాల సెగను తట్టుకుని తిరుమల చెంతకు: సంయుక్త మీనన్ ఎమోషనల్ పోస్ట్

45 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనిచేయడం తనను పరీక్షించిందన్న సంయుక్త

మండుతున్న ఎండలను లెక్క చేయకుండా టీమ్ పనిచేసిందని కితాబు

టాలీవుడ్ 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్ తన తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్' షూటింగ్‌లో ఎదురైన సవాళ్లను వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. సినిమా తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, దాని వెనుక చిత్ర యూనిట్ పడే శ్రమ ఎంతటిదో ఆమె పెట్టిన పోస్ట్ నిరూపిస్తోంది.సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మంచిర్యాలలో షూటింగ్ నిర్వహించింది. అక్కడ 40 నుంచి 45 డిగ్రీల తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య పనిచేయడం తమను శారీరకంగా, మానసికంగా పరీక్షించిందని సంయుక్త పేర్కొంది. మండుతున్న ఎండలు, తీవ్రమైన అలసట వేధించినప్పటికీ చిత్ర బృందం ఎక్కడా వెనకడుగు వేయకుండా పనిచేసిందని ఆమె కితాబునిచ్చింది. డీహైడ్రేషన్ బారిన పడకుండా తన పర్సనల్ టీమ్ (నిహారిక, పార్థు) తీసుకున్న జాగ్రత్తలు, దర్శకుడు యోగి అందించిన ప్రోత్సాహం వల్లే ఈ కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేయగలిగానని తెలిపింది.మంచిర్యాల షెడ్యూల్ ముగిసిన వెంటనే సంయుక్త నేరుగా తిరుమలకు చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఆమె, ఆ ప్రశాంతతలో దిగిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఎంతటి ఒత్తిడిలో షూటింగ్ ప్రారంభించానో, అంతే ఉత్సాహంతో తిరిగి వస్తున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.





# తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారంటూ తమన్నా పిటిషన్.. కొట్టివేసిన హైకోర్టు

తమన్నా, పవర్ సోప్స్ మధ్య 2008లో కుదిరిన ఒప్పందం 2009 అక్టోబర్ వరకు ప్రచారానికి అనుమతి 2010-11లలోనూ పవర్ సోప్స్ తన ఫొటోలతో ప్రచారం చేసిందని కోర్టుకు వెళ్లిన తమన్నా సాక్ష్యాలు చూపలేదంటూ పిటిషన్ కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు 'పవర్ సోప్స్' కంపెనీపై ప్రముఖ సినీ నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2009 అక్టోబర్ వరకు తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఉంది.అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010-2011 మధ్య ఈ సంస్థ తన ఫొటోలను అనుమతి లేకపోయినప్పటికీ ఉపయోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకు గాను తనకు రూ.1 కోటి పరిహారం నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇందుకు సంబంధించి సాక్ష్యాలు చూపలేదంటూ కోర్టు తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com